# నీటిపంపకంలో అసమానతే వైషమ్యాలకు కారణం

ఇంతకాలం హేతుబద్ధమైన విధానాలను అవలంబించక పోవడం వల్లనే ప్రాంతాల మధ్య అసమానతలు, అశాంతులు పెరిగి చివరకు ప్రత్యేక రాష్ట్ర నినాదం వైపుగా తెలంగాణా, రాయలసీమ ప్రజానీకం ఆలోచిస్తున్నారని కృష్ణాజలాల పున:పంపిణీ కన్వీనర్, మానవ హక్కుల వేదిక నాయకులు డాక్టర్ కె .బాలగోపాల్ అభిప్రాయపడ్డారు. కృష్ణా జలాల పున:పంపిణీ అంశంపై గత రెండు సంవత్సరాలుగా కృషి చేస్తున్న డా.బాలగోపాల్ జిల్లాలోని ప్రాజెక్టుల తీరు తెన్నులను పరిశీలించేందుకు శనివారం చిత్రావతి, గండికోట, మైలవరంలను సందర్శించారు. ఈసందర్భంగా కడప 'ఆన్‌లైన్ ప్రతినిధి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్ర: ప్రాంతీయ అసమానతలు, జల పంపిణీ వంటిసమస్యలపై సీరియస్‌గా కృషి చేస్తున్నారు కదా, దీనికి ప్రత్యేకమైన కారణం ఏదైనా వుందా ?

జ: కర్నాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య కృష్ణా జలాలపై బచావత్ ట్రిబ్యునల్ కాలపరిమితి తీరిపోయింది. మూడు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీ అసమానతలను తొలగించే ప్రయత్నం చేయకపోతే తిరిగి 30,40 సంవత్సరాల పాటు అసమానతలు కొనసాగుతాయి. దీని వల్ల రాష్ట్రంలో 'అనూహ్యమైన' అశాంతి ఏర్పడే ప్రమాదముంది. ఈ విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి జలాల పంపిణీలో అసమానతల తొలగింపునకు కృషి చేయాలనేదే ధ్యేయం.

ప్ర: అసమానతలు ఎలా ఉన్నాయి, నీటి పంపిణీ ఎలా జరగాలి ?

జ:నికర జలాల పంపిణీలో ప్రాంతాల వారీ ప్రాజెక్టుల నిర్మాణంలో అసమానతలు సమాజం సిగ్గుపడే విధంగా వున్నాయి. ఈ అసమానతలను ప్రభుత్వాలు నిస్సంకోచంగా,నిసిగ్గుగా కొనసాగిస్తున్నాయి. దీనికి ప్రత్యేక ఉదాహరణగా ' పులిచింతల'ప్రాజెక్టును పేర్కొనవచ్చు. ఆధునీకరణ, నీటి నియంత్రణ, పొదుపు తదితర కారణాలను చూపడం ద్వారా రాష్ట్రంలో 1. శ్రీశైలం కుడికాలువ 2.భీమా 3. పులిచింతల ప్రాజెక్టులకు కేంద్ర జలసంఘం నుండి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి సాధించింది. మొదటి రెండు ప్రాజెక్టులు రాష్ట్రంలో అత్యంత కరువు ప్రాంతాలైన రాయలసీమ, దక్షిణ తెలంగాణజిల్లాలకు సాగు నీరందించేవి.

' పులిచింతల' మాత్రం ఇప్పటికే సంవత్సరానికి రెండు పంటలు పండించే ప్రాంతానికి అదనంగా సాగునీరందించే ప్రాజెక్టు. ఇలాంటపుడు శ్రీశైలం కుడికాల్వ, భీమాల ఊసెత్తకుండా 'పులిచింతల' ప్రాజెక్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది.

ప్ర: పులిచింతలకు ఎస్. ఆర్. ఐ నిధులు సమకూర్చుతున్నారట కదా?

జ: పులిచింతల నిర్మాణాన్ని చేపట్టితే ప్రాంతీయ పక్షపాతం చూపిస్తున్నదనే విమర్శలు తప్పించుకోవడానికి 'ప్రభుత్వం' ఆడుతున్న నాటకమే ఈ ఎస్. ఆర్. ఐ ల నిధుల ప్రచారం. ఎస్. ఆర్. ఐలు కొంత నిధులు సమకూర్చినా ఆ నిధులేవి ఉచితంగా వారు ఇచ్చేవి కావు. 11 శాతం వడ్డీతో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.

ప్ర:ఆల్మట్టిపై ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వం లేవనెత్తుతున్న అభ్యంతరాల మాటేమిటి?

జ: ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న వాదన అర్థం లేనిది. బచావత్ ట్రిబ్యునల్ మూడు రాష్ట్రాలకు కృష్ణా జలాలు పంచేటపుడు రెండు ప్రతిపాదనలు చేశారు. అవి స్కీం ఎ., స్కీం బి. స్కీం ఎ ప్రకారం పైనున్న మహారాష్ట్ర , కర్నాటకలు తమ వాటా నీటిని నిలుపుకొని , ఆపై వచ్చే నీటిని దిగువకు వదలాలి. వర్షాభావ సంవత్సరాలలో దిగువకు నీరు అందదు. ఈ నష్టానికి ప్రతిగా కృష్ణాలోని మిగులు జలాలను వాడుకునే పూర్తి స్వేచ్ఛ ఆంధ్రప్రదేశ్‌కు ఉంటుంది. స్కీం బి ప్రకారమైతే ప్రాజెక్టులలో వచ్చి చేరిన నదీ జలాలను వచ్చిన వాటిని వచ్చినట్లుగా 3 రాష్ట్రాలకు కేటాయించిన దామాషా ప్రకారం ఎప్పటికప్పుడు నీటి విడుదల జరుగుతుంది.అలాగే మిగులు జలాలు కూడా కేటాయించిన దామాషా ప్రకారం మూడు రాష్ట్రాలు పంచుకోవాల్సి వస్తుంది. బచావత్ ప్రతిపాదించిన ఈరెండు ప్రతిపాదనల్లో ఆంధ్రరాష్ట్రం స్కీం ఎనే కోరుకొంది. అప్పట్లో కర్నాటక, మహారాష్ట్ర లతో తమ వాటానీటిని పూర్తిస్థాయిలో వాడుకునే ప్రాజెక్టులు కట్టుకోలేదు. ఈపరిస్థితిని తనకు అనుకూలంగా మలుచుకొని మిగులు జలాలన్నింటిని వాడుకోవచ్చనే ఉద్దేశ్యంతో ఆంధ్ర రాష్ట్రం స్కీం ఎ ని కోరుకొంది. ఆ రకంగా గత 40 సంవత్సరాలుగా ఆ నీటినంతా కృష్ణా డెల్టా వారు యధేచ్ఛగా వాడుకొంటున్నారు. ప్రస్తుతం కర్నాటక ఆల్మట్టి ఎత్తుపెంచితే 'కృష్ణా డెల్టా' ప్రాంతానికి సకాలంలో నీరందదని, నాట్లు ఆలస్యమవుతాయని, ఆందోళన చెందడంలో అర్థం లేదు. గతంలో స్కీం ఎన్నుకోవడం వల్లనే ఇలా జరిగింది. ఆల్మట్టి ఎత్తుపెంచి అక్కడి నుండి గ్రావిటీపై ప్రపంచంలోనే అత్యంత కరువు జిల్లా అయిన మహబూబ్‌నగర్ జిల్లాకు నీటిని పొందే అవకాశాల రీత్యా ' ఆల్మట్టి' ఎత్తు పెంచడాన్ని మేం నిర్ద్వంద్వంగా సమర్థిస్తున్నాం. కేవలం కృష్ణా డెల్టా ప్రయోజనాలను కాపాడేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆల్మట్టి ఎత్తు పెంచడాన్ని వ్యతిరేకిస్తోంది తప్పితే ఇందుకు సహేతుకమైన కారణం లేదు అన్న విషయాన్ని మేం స్పష్టం చేస్తున్నాం.


ప్ర: ట్రిబ్యునల్‌కు వెళ్ళేటట్లయితే 'రాష్ట్ర ప్రభుత్వ' వైఖరి ఎలా ఉండాలి?

జ: ట్రిబ్యునల్‌కు వెళ్ళే ముందు ప్రస్తుతం మనకు లభిస్తున్న కృష్ణా నికరజలాలను హేతుబద్ధంగా, ప్రాజెక్టుల వారీగా పున:పంపిణీ చేయాలి. ఈ పున:పంపిణీని చట్టబద్ధం చేసి ఆ ప్రాతిపదికగా నీటి కేటాయింపుల కోసం ట్రిబ్యునల్ ముందుకు వెళ్ళాలి. ఇలా చేయడం వల్లనే వివిధ దశల్లో ఉన్న ప్రాజెక్టుల ' ఎక్సిస్టింగ్ రైట్స్' ప్రాతిపదికన ట్రిబ్యునల్‌తో నీటి కేటాయింపు సాధ్యమవుతుంది. మరో వైపు ఇంత కాలంగా నీటి కేటాయింపుల్లో వివిధ ప్రాంతాలకు జరిగిన అన్యాయాన్ని సవరించినట్లు అవుతుంది. అన్నింటికి మించి మన వాదన న్యాయబద్ధంగా ఉంటుంది.

ప్ర: మిగులుజలాల విషయంలో మీ వైఖరి ఏమిటి?

జ: వాటిపేరే మిగులు జలాలు. ఈజలాలు ప్రస్తుతం ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రాజెక్టులకు సరిపోవు. వున్న నికర జలాలన్నీ అభివృద్ధి చెందిన ప్రాంతం వారు తీసుకెళ్ళిపోతే చాలీచాలని మిగులు నీటిని పంచుకోవడంలో వెనుకబడిన ప్రాంతాల వారు తల బద్దలు కొట్టుకొంటారు. ఇప్పటికే తెలంగాణ, రాయలసీమ నాయకులు చాలా బాధ్యతారహితంగా ఒకరినొకరు నిందించుకొంటున్నారు. ఉన్న నికరజలాలన్నీ కృష్ణా డెల్టాకు తరలిపోయి, వారు మూడో పంట పండించుకొంటుంటే వెనకబడిన ప్రాంతాల వారు తలలు పగులకొట్టుకోవడానికే చాలీచాలని మిగులు జలాలు ఉపయోగపడతాయి.

ప్ర: కరువు ప్రాంతాల్లో కృష్ణా నదీజలాల వినియోగంపై మీ పరిశీలనలు ఏమిటి?




జ: ఇప్పటివరకు కడప,కర్నూలు,అనంతపురం, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ప్రాజెక్టుల పరిస్థితిపై సర్వే జరిపాము. అలాగే ఈ జిల్లాల్లో పెండింగ్ ప్రాజెక్టుల పట్ల ప్రభుత్వం ఎంత పారదర్శకంగా ఉందోనన్న విషయాన్ని పరిశీలిస్తున్నాము. ఇక్కడ ఉన్నాయని చెబుతున్న ప్రాజెక్టుల నీటి పరిమాణం తక్కువైనప్పటికీ , ఆ నీరు కూడా సక్రమంగా అందడం లేదు. ఈ విధమైన ఫిర్యాదు కృష్ణా డెల్టా, సాగర్ కుడి కాల్వల ఆయకట్టు ప్రాంతాల్లో మనకు కనిపించలేదు. నీటి కేటాయింపులు ఉంటే నిర్లక్ష్యానికి గురవుతున్న ప్రాజెక్టులకు ఉదాహరణలుగా జూరాల ప్రాజెక్టును పేర్కొనవచ్చు. దీని కెపాసిటీ 17 టి ఎం సిలు అయితే దీన్ని 11 టి ఎంసిలకు కుదించారు. ప్రాజెక్టు వచ్చినప్పటినుండి ఇంత వరకు ఒక్క సంవత్సరం కూడా 4టి ఎంసిలకు మించి నీరు అందలేదు. శ్రీశైలం ఎడమకాల్వ – 30 టి ఎం సిల నీటిని శ్రీశైలం నుండి ఈ కాల్వకు అందించే హామీ వుంది. అయితే ఈ కాల్వను శ్రీశైలం నుంచి తొలగించి, నాగార్జునసాగర్ బ్యాక్ వాటర్ నుండి 1. ఎలిమినేటి మాధవరెడ్డి కాల్వ 2. వరదనీటి కాల్వలు గా విభజించారు. పై రెండు కాల్వలకు కలిపి 11, 12 టి ఎం సిల నీరు మాత్రమే వస్తుంది. శ్రీశైలం పూర్తిగానిండితేనే తెలుగుగంగకు సాగు నీరు వచ్చే పరిస్థితి ఉంది. శ్రీశైలం కుడిగట్టు కాల్వ పరిస్థితి ఇంతే . కె.సి. కెనాల్, రాజాలిబండ్‌లతో కేవలం 60 శాతం నీరే అందుతుంది. ఇలా ఇక్కడ నిర్మాణాలు పూర్తయి సాగునీరందించే ( ఎక్సిస్టింగ్ ప్రాజెక్ట్స్) ప్రాజెక్టుల నీటి కేటాయింపులు దారుణంగా వున్నాయి. ఇక పెండింగ్ ప్రాజెక్టుల పరిస్థితి దారుణంగా ఉంది. మహబూబ్‌నగర్ జిల్లాలోని కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, భీమా, అనంతపురంలోని హంద్రీనీవా, కడపలోని గండికోట ప్రాజెక్టులు దీనికి ఉదాహరణలు. ఇందులో భీమా ప్రాజెక్టు విషయంలో పాలకుల నిర్లక్ష్యవైఖరి క్షమించరానిది. నీటి కేటాయింపు వుండి కేంద్ర జలసంఘం అనుమతి పొంది కూడా ఇంత వరకు ఏ ఒక్కపని మొదలు పెట్టలేదు. కడప గండికోట మునక ప్రాంతంలోనే మంత్రి రామసుబ్బారెడ్డి శాశ్వత గృహాల నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ నిర్లక్ష్యాన్ని తెలుపుతూ డిసెంబరు నెలకల్లా సవివరమైన రిపోర్టును ప్రచురిస్తాం. ఈ వివరాలను కృష్ణా , గుంటూరు జిల్లాల్లో కూడా ప్రచారం చేసి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి అక్కడి ప్రజల మద్దతును కూడగట్టే ప్రయత్నం చేస్తాం.

*